

అస్తవ్యస్తంగా మార్కెట్ పాలన

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పాలన అస్తవ్యస్తంగా మారింది. ఉద్యోగులు, సిబ్బందిపై పర్యవేక్షణ లేకుండా పోయిందని ప్రచారం జరుగుతోంది. - 8లో▸



మొక్కజొన్న దగ్ధం

వరంగల్ జిల్లాలోని నెక్కొండ, సంగెం మండలాల్లో మొక్కజొన్న చేన్లు దగ్ధమయ్యాయి. బాధిత రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/28^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గో సంరక్షణకు పాటుపడాలి



నెక్కొండ: గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలంగాణ గోశాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. మండలంలోని గొట్లకొండ గ్రామ శివారు అజ్మీరా మంగ్యానాయక్ తండాలో ఆదివారం శ్రీ మంజునాథ గోశాల వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు లేగ దూడలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజనులు పాడి (పశువులు)ని సమృద్ధిగా పెంపొందించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం దెబ్బ తింటుందన్నారు. వరంగల్, మహబూబాబాద్ జిల్లాలో పలు చోట్ల గిరిజనులు లేగ దూడలను అందించామని పేర్కొన్నారు. పశురైతులు పశువుల చికిత్స కోసం 1962 అంబులెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పది మంది రైతులకు రెండేసి చొప్పున 20 లేగ దూడలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరోజ, గోశాల ప్రతినిధి వెంకన్న, రైతులు, తండావాసులు పాల్గొన్నారు.

నేడు మెడికల్ కళాశాలల నిర్మాణ పనులపై సమీక్ష

జనగామ: జనగామ చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) పక్కన మెడికల్ కళాశాలలో భాగంగా క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులతో పాటు తదితర వాటిపై ఎమ్మెల్యే ముత్తిరెడి యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో నేడు(సోమవారం) సమీక్షించనున్నారు. ముందుగా పనులను పరిశీలించి, సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించి, పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ఈమేరకు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి ఉత్సవాలు



స్టేషన్‌ఘన్‌పూర్: ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన శ్రీపెద్దమ్మతల్లి, శ్రీరేణుకా ఎల్లమ్మ 11వ వార్షికోత్సవాలు ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి గుడి వద్ద ఉత్సవ కమిటీ, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వేదపండితులు జోష్యం వినయ్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు చేపట్టారు. పెద్దమ్మతల్లి ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నేడు పెద్దమ్మ తల్లి పట్నాలు, పెద్దమ్మ తల్లి బోనాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు తెలిపారు. పూజల్లో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బూర్ల శంకర్, ఎంపీటీసీ బూర్ల లత, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నీల లింగం, సొసైటీ కార్యదర్శి చెన్నూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు నీల బుచ్చయ్య, ఉత్సవ కమిటీ కార్యదర్శి కొండ వేణు, ఉపాధ్యక్షులు సంకెళ్ళ రవి, డైరెక్టర్లు సోమయ్య, రాజయ్య, మల్లయ్య, వేణు, సుమన్, యాదగిరి తదితర ముదిరాజ్ కులపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలుపై హామీ ఇవ్వాలి

హన్మకొండ: రాష్ట్రంలో పాత పెన్షన్ అమలుకు రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంట్రిబ్యూటరీ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఎస్ఎంటీపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ, తెలంగాణ సీపీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ఆయా యూనియన్ల ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తూ ఉద్యోగుల అభిమానాన్ని పొందిందని.. కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో మొదటి ప్రాధాన్యత ఇవ్వగా ఉద్యోగుల సహకారంతో అఖండ విజయం సాధించిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోనూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగుల మన్ననలు పొందాలని, ఇది ఉద్యోగుల చట్టబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. ఓపీఎస్ పునరుద్ధరించకపోతే ఏ ప్రభుత్వమైనా ఇంటిదారి పట్టాల్సిందేనన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ కుమార్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ముత్తిరెడ్డి'కి ఇంటిపోరు!



భూవివాదంలో జనగామ ఎమ్మెల్యే
- చీటింగ్ కేసు పెట్టిన కూతురు..
- రాజకీయ కుట్ర ఉందంటున్న యాదగిరిరెడ్డి
- హీటెక్కిన జనగామ బీఆర్ఎస్ రాజకీయాలు

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉద్యమాల ఖిల్లా జనగామలో అధికార పార్టీలో సరికొత్త రాజకీయం నడుస్తున్నది. విపక్ష పార్టీలతోపాటు ఇంటిపోరును సైతం ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి 159 గజాల కమర్షియల్ బిల్డింగ్‌ను కినారా గ్రాండ్‌కు అక్రమంగా లీజ్ అగ్రిమెంట్ చేయించాడని కూతురు తుల్జా భవానీరెడ్డి ముత్తిరెడ్డిపై కేసు పెట్టడం కలకలం రేపింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. ఈ భూవివాదం కేసు వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. తాను ఎవరి సంతకాలు ఫోర్జరీ చేయలేదని, కూతురు ఆస్తి ఆమె పేరునే ఉందని వివరించారు. కూతురుతో గొడవలు వాస్తవమే.. అయినా అది కుటుంబ విషయమని, ప్రత్యర్థులు కావాలని దానిని రాజకీయం చేస్తున్నారంటూ భావోద్వేగానికి గురయ్యారు. తప్పు చేస్తే తమ అధినేత కేసీఆర్ ఊరుకోడని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా.. వాస్తవానికి భవానీరెడ్డి గత ఫిబ్రవరి 4న ఎమ్మెల్యేపై ఉప్పల్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదైంది. కేసు ఫైల్ అయి మూడు నెలలు దాటింది. ఇన్ని రోజులు బయటకు రాని కేసు వివరాలు ఇప్పుడే మీడియాకు ఎలా అందాయి..? తెరవెనుక ఎవరు ఉన్నారు..?అనేదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే ముత్తిరెడ్డి అంటున్న రాజకీయ ప్రత్యర్థులు సొంత పార్టీ వారా?లేక ప్రతిపక్ష పార్టీల లీడర్లా? అంటూ స్థానికంగా చర్చ సాగుతోంది.

కాంగ్రెస్ కోటలో పాగా.. వివాదంలో ముత్తిరెడ్డి..

ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న జనగామలో 2014లో ముత్తిరెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. 2018లో రెండోసారి సిట్టింగ్ ఎమ్మెల్యేగా సీటు సాధించి గెలుపొందారు. నాటి నుంచి ఆయనకు అపోజిషన్‌లో స్థానికంగా ఉండే సరైన నాయకుడు లేడు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో పాటు కాంగ్రెస్, బీజేపీలో కొందరు లీడర్లు ఉన్నా.. వారు గ్రూప్ రాజకీయాలతో సతమతమవ్వడం ముత్తిరెడ్డికి కలిసి వస్తోంది. ఇదిలా ఉంటే కొన్ని రోజులుగా ఎమ్మెల్యే తీరుపై ఇటు ప్రజలు అటు నాయకుల్లో అసంతృప్తి పెరుగుతోంది. ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా సమయానికి హాజరుకారనే అపవాదు ఉంది. కింది స్థాయి నాయకులను ఎదగనీయకపోవడం, జనగామలో తానే సుప్రీం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆయన సమీప బంధువు, మాజీ ప్రొఫెసర్ ఒకరు ఆయన వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారన్న చర్చ పార్టీ క్యాడర్‌లో ఉండగా.. జిల్లాకు చెందిన వేరే నాయకులు జనగామలో ఏదైనా కార్యక్రమం చేయాలంటే ముత్తిరెడ్డి పర్మిషన్ తీసుకోకుండా రావడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీని ఫలితంగానే ఎమ్మెల్యేపై సొంత పార్టీలోనే అసంతృప్తి వాదులు పెరుగుతున్నారన్న చర్చ ఉంది. ఇది గ్రహించిన బీఆర్ఎస్ అధిష్టానం గతంలో ఇన్‌చార్జ్ రూపంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని రంగంలోకి దింపింది.

హాట్‌హాట్‌గా జనగామ బీఆర్ఎస్ రాజకీయాలు

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి జనగామ టికెట్ ఆశిస్తున్నారని గతంలో వచ్చిన వార్తలను ఆయన కొట్టిపారేశారు. కానీ కొన్ని రోజులుగా మళ్లీ జనగామ అసెంబ్లీ స్థానానికి పోచంపల్లి పేరు తెరమీదికి వస్తుండగా, నియోజకవర్గానికి చెందిన నాయకులు ఆయనను కలిసి జనగామ నుంచి పోటీ చేయాలని కోరినట్లు ప్రచారం. అయితే ఇందుకు తగ్గట్టుగా పోచంపల్లి కూడా జనగామ చుట్టూ తన కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఇటీవల రూ.ఐదు కోట్ల నిధులతో జీడికల్ దేవస్థానం అభివృద్ధి పనులు చేపట్టారు. కొడ్వటూరు సిద్దేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి రూ.రెండు కోట్లు కేటాయించారు. జనగామ ప్రజల కోసం లోకల్ ట్రైన్‌ను పొడిగించాలని, ఎంఎంటీఎస్ ట్రైన్ వేయాలంటూ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. జనగామ నియోజకవర్గంలో శుభ, అశుభ కార్యాలకు పోచంపల్లి హాజరవుతూ ఆర్థిక సహాయం కూడా చేస్తున్నారు. ఇవన్నీ పోచంపల్లి జనగామ టికెట్ కోసమే చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఇంతకాలం జనగామలో తనకు ఎదురేలేదనుకున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి సొంత పార్టీలోనే పోచంపల్లి రూపంలో వేరే కుంపటి తయారయింది. కొందరు నాయకులు ఇప్పటికే రెండు వర్గాలుగా చీలినట్లు ఇటీవల జరుగుతున్న పరిణామాలను చూస్తే తెలుస్తోంది. ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి అనుకూలంగా ఉండే నేతలు మూడోసారి ఆయనే ఎమ్మెల్యే అంటూ వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెడుతుండగా.. ముత్తిరెడ్డి అంటే గిట్టని నేతలు ఎమ్మెల్సీ పోచంపల్లికి అనుకూలంగా ఫొటోలు, పోస్టులు పెడుతున్నారు. పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటలు బయటపడకున్నా.. సోషల్ మీడియా వేదికగా పోటాపోటీగా పెడుతున్న పోస్టులు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.

ఆలయాల పూర్వ వైభవానికి కృషి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : తెలంగాణ ప్రభుత్వం హయాంలో ఆలయాల పూర్వవైభవానికి కృషి చేస్తున్నట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు పేర్కొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని కామారెడ్డి గూడెంలో ఆంజనేయ స్వామి భక్తులు నిర్వహించిన 'రామయజ్ఞం, ఇరుముడి' కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చిప్పరాళ్లబండ తండాలో మాజీ సర్పంచ్ బాలునాయక్‌బుచ్చమ్మ కూతురు లావణ్య-ఉపేందర్ వివాహమహోత్సవంలో పాల్గొని కానుకలు అందజేశారు. కార్యక్రమాల్లో స్వాములు మొలుగూరి రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్, సుందర్‌రామ్ రెడ్డి, రవి, సోమయ్య, సోమయ్య, యాదవరెడ్డి, హనుమంతు, లీనారెడ్డి, తాటి పెల్లి మహేష్, దుబ్బాక రత్నాకర్, రమేష్, నగేష్, గడ్డం రాజు, మూడ శంకర్, భూక్య శ్రీను, గుగులోత్ కొక్య తదితరులు పాల్గొన్నారు



కామారెడ్డిగూడెంలో రామయజ్ఞం- ఇరుముడి కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి

రామప్ప కుంట నుంచి మట్టి తరలింపు



మట్టిని తవ్వుతున్న యంత్రాలు



మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

- పట్టించుకోని అధికారులు

జనగామ రూరల్: ప్రభుత్వ పనుల పేరిట అధికారులు, కాంట్రాక్టర్లు, గ్రామ పంచాయతీ పాలకవర్గం కుమ్మక్కై కుంటలోని మట్టిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం. చిటకోడూర్ గ్రామంలో రామలింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఫేస్ 1, 2 చెక్ డ్యాంల నిర్మాణపనులు అసంపూర్తిగా నాణ్యత ప్రమాణాలు, ఇంజనీర్ పర్యవేక్షణ లేకుండా జరిగాయి. చెక్ డ్యాం కట్టపై గ్రామంలోని రామప్పకుంట నుంచి సదరు కాంట్రాక్టర్ ఏకంగా ప్రోక్‌లెనైర్‌తో టిప్పర్లు పెట్టి మట్టిని తరలిస్తున్నారు. మొరం లేదా.. కంకర వేయాల్సి ఉండగా మట్టితో పనులు చేపట్టి అభివృద్ధి పనులపేరుతో బిల్లులు తీసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అయితే గ్రామంలో సాదు భూములు చెరువులు, కుంట మట్టిని తరలించుకుంటే రైతులపై కేసులు పెడతామన్న అధికారులు కాంట్రాక్టర్‌కు ఎలా పర్మిషన్ ఇచ్చారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి కుంటలోని మట్టిని తరలించిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీరభద్రుడిని దర్శించుకున్న సివిల్ జడ్జి

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని ఆదివారం హనుమకొండ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతిసోని కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, కార్యనిర్వహణ అధికారి కిషన్‌రావు, అర్చకులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న సివిల్ జడ్జి శాంతిసోని

పరిహారం మంజూరు

- 4,443 ఎకరాల్లో పంటల నష్టం
- రూ.4.44 కోట్లు మంజూరు
- ఏప్రిల్ సర్వే పూర్తి.. రెండు రోజుల్లో సర్కారుకు నివేదిక

జనగామ: వడగళ్ల వర్షం రైతాంగాన్ని ఆగం చేసింది. చేతికందివచ్చిన పంటలు అకాల వర్షాలతో కొట్టుకుపోవడంతో రైతులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. వరుణుడి కన్నెర్రతో సగం దిగుబడులు కోల్పోయి.. మిగిలిన పంటపై పెట్టుకున్న ఆశలను ఆవిరయ్యాయి. ఏప్రిల్‌లో వరుసగా కురిసిన వడగళ్లు, గాలి దుమారం, భారీ వర్షాలతో అన్నదాతలు సర్వం కోల్పోయారు. పెట్టుబడులు.. ఆరుగాలం శ్రమ పైసా రాకుండా చేయడంతో ఆవేదనలో ఉన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం భరోసా కల్పించింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేల పరిహారం ప్రకటించింది. మార్చి మాసంలో దెబ్బతిన్న పంటలు రూ.4.44కోట్ల పరిహారం మంజూరు చేయగా, ఏప్రిల్‌కు సంబంధించి ప్రాసెస్‌లో ఉంది.

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.31లక్షల ఎకరాల్లో వరి, మామిడి, మొక్కజొన్న, టొబాకో, మిర్చి తదితర పంటలను సాగు చేశారు. 12 మండలాల పరిధిలో 75వందల ఎకరాలకు పైగా మామిడి తోటలను సాగు చేస్తున్నారు. ఏటా మార్చి, ఏప్రిల్ మాసంలో వడగళ్లు పలకరిస్తూనే ఉన్నాయి. కానీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత నెల కురిసిన వడగళ్లతో అనేక గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 140 కిలో మీటర్ల వేగంతో వీచిన గాలిదుమారం కిలోన్నర సైజులో ఆకాశం నుంచి కుప్పలు తెప్పలుగా పడ్డ మంచుగడ్డలు(వడగండ్లు) వరి గింజలను రాల్చి.. కనీసం పశువులకు మేత సైతం మిగలకుండా చేసింది. ఐదు ఎకరాల్లో వరి సాగు చేస్తే.. 10 నుంచి 20 బస్తాల దిగుబడి రాని దయనీయ పరిస్థితి. వరి కోత యంత్రాల చార్జీలు సైతం గిట్టుబాటు కాని పరిస్థితుల్లో అనేక చోట్ల రైతులు పంటలను వదిలి పెట్టడం గమనార్హం. వేలాది ఎకరాల్లో మామిడి, టొబాకో, మొక్కజొన్న, మిర్చి, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

వర్షాభావ పరిస్థితులతో..

వరిగింజ గట్టిపడే సమయంలో వర్షాభావ పరిస్థితులు.. అడగంటిన భూగర్భజలాలు.. అప్పుడప్పుడు విద్యుత్ కోతలతో 15 శాతం మేర వరి పంటలు ఎండిపోయాయి. పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు రాత్రింబవళ్లు వ్యవసాయ పొలాల వద్దనే పడిగాపులుకాచారు. నెల రోజుల్లో పంటకోతలు మొదలవుతాయనుకునే సమయంలో అకాల వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. మొదట్లో సాగునీరు అందక ఎండిపోతే.. మిగిలిన పంటను వరుస వడగళ్లు నిండా ముంచేశాయి.



అండగా ప్రభుత్వం

వడగళ్లతో నష్టపోయిన పంటలకు పరిహారం అందిస్తామని ప్రభుత్వం భరోసా కల్పించింది. ఎకరాకు రూ.10వేల పరిహారంపై హామీ ఇవ్వగా.. మార్చిలో దెబ్బతిన్న వరి, మామిడి, మొక్కజొన్న, టొబాకో, తదితర పంటలకు డబ్బులు రిలీజ్ చేసింది. మార్చి 18వ తేదీన 9 మండలాల పరిధిలో 3,698 మంది రైతులకు చెందిన 4,443 ఎకరాల్లో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ సర్కారు నివేదిక పంపించింది. ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.4.44కోట్ల పరిహారం డబ్బులు మంజూరు చేయగా, రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. కాగా, ఏప్రిల్‌లో దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో సమగ్ర రిపోర్టును ప్రభుత్వానికి పంపించనున్నారు.

రైతుల ఖాతాల్లో జమచేయాల్సి ఉంది..



ఈ ఏడాది మార్చిలో అకాల వర్షాలు, వడగళ్లతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. 9 మండలాల పరిధిలో 3,698 మంది రైతులకు చెందిన 4,443 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, ఇతర పంటలు నష్టపోయాయి. ఇందుకు సంబంధించిన నివేదికలను సర్కారుకు పంపించగా, పరిహారం విడుదల చేశారు. రైతుల ఖాతాల్లో జమకావాల్సి ఉంది. ఏప్రిల్ మాసంలో జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం.

- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, జనగామ

మండలాల వారీగా నష్టం, పరిహారం వివరాలు

మండలం	రైతులు	పరిహారం	నష్టపోయిన పంటలు
జనగామ	10	రూ.43.42లక్షలు	43.17ఎకరాలు
నర్మెట	134	రూ.12.19లక్షలు	121.37
తరిగొప్పుల	301	రూ.16.73లక్షలు	167.15
చిల్పూరు	202	రూ.22.47లక్షలు	224.29
స్టే.ఘన్‌పూర్	76	రూ.7.77లక్షలు	77.30
జఫర్‌గఢ్	216	రూ.28.61లక్షలు	286.05
పాలకుర్తి	117	రూ.10.94లక్షలు	109.17
దేవరుప్పుల	255	రూ.21.75లక్షలు	217.21
కొడకండ్ల	2,387	రూ.3.19కోట్లు	3,195.21

విధుల్లోకి జేపీఎస్‌లు

- సమ్మె విరమించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- నేటి నుంచి 176 మంది సేవలు మరూ..
- అర్ధరాత్రి కలెక్టర్ నేతృత్వంలో సమీక్ష

జనగామ: హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో తిరిగి విధుల్లో చేరారు. 16రోజుల పాటు నిరసన దీక్షలు చేసిన జేపీఎస్‌లు నేటి(సోమవారం) నుంచి తమ సేవలను పునఃప్రారంభించనున్నారు. దీనిపై శనివారం అర్ధరాత్రి వరకు డీపీఓ రంగాచారి, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో జేపీఎస్‌ల సంఘ ప్రతినిధులు ప్రభుత్వంతో రాత్రి వరకు జరిగిన చర్చలు విజయవంతం కావడంతో సహచర ఉద్యోగులను విధుల్లో చేరాలని ఆదేశించారు. దీంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఒక్కొక్కరుగా డీపీఓ సమక్షంలో విధుల్లో చేరుతున్నట్ల అంగీకార పత్రం అందించారు.

జిల్లాలో 12 మండలాలు.. 218 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు సుమారు 50 మంది వరకు ఉండగా, జేపీఎస్‌లు 176 మంది ఉన్నారు. ప్రొహిబిషన్ పీరియడ్ నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి రాకపోవండతో గత నెల 13వ తేదీన సమ్మె నోటీసు అందించి, అదే నెల 28వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు, దీక్షలు చేపట్టారు. దీంతో గ్రామ పంచాయతీల పరిధిలో రోజువారీ కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. జేపీఎస్‌లు విధుల్లో చేరాలని ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి తీసుకు రావడంతో పాటు డెడ్‌లైన్ సైతం విధించింది. అయినప్పటికీ వారు వెనక్కి తగ్గకుండా, నిరసన దీక్షలు అలాగే కొనసాగించారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు విధుల్లో చేరాలని, లేని పక్షంలో శాశ్వతంగా ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరికలను జారీ చేసింది. ఈక్రమంలో జేపీఎస్‌ల రాష్ట్ర కమిటీ స్పందించి, ప్రభుత్వంతో చర్చలకు ఓకే చెప్పడంతో అర్ధరాత్రి వరకు సమస్య కొలిక్కి వచ్చింది.



జేపీఎస్‌లతో మాట్లాడుతున్న డీపీఓ

నేటి నుంచి విధుల్లోకి..

ఉద్యోగాలను రెగ్యులర్ చేయడంతో పాటు పలు డిమాండ్లతో సమ్మెకు దిగిన జేపీఎస్‌లు ఎట్టకేలకు నేటి నుంచి విధుల్లో చేరనున్నారు. ఇంటి, నల్లా పన్నుల వసూళ్లు, ఆన్‌లైన్ లో అప్‌లోడ్, డ్రెయినేజీ, శానిటేషన్ పర్యవేక్షణ, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, స్వచ్ఛ సర్వేక్షణ్, వైకుంఠధామాలు, ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ, తడి పొడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువు తయారీ, ఇంకుడుగుంతల నిర్మాణంపై ప్రజల్లో అవగాహన తదితర పనులతో జేపీఎస్‌లు ఎప్పుడూ పని ఒత్తిడితో బిజీగా ఉంటారు. దీనికి తోడు జిల్లా స్థాయిలో సమీక్షలు, వీసీలు, అధికారుల పర్యటనకు సంబంధించి సైతం వీరే చూసుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటికి తోడు ఉదయం 7 గంటల వరకే ఊరికి చేరుకుని 9గంటల లోపు ఆన్‌లైన్ అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది. అనేక సవాళ్లను, ఒత్తిళ్లను ఎదుర్కొంటూ గ్రామాల అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్న జేపీఎస్‌లు ప్రభుత్వంపై నమ్మకం ఉంచి.. న్యాయం చేస్తారనే ఆకాంక్షతో తిరిగి ఉద్యోగంలో చేరుతున్నారు.

నమ్మకం ఉంది



ఉద్యోగంలో చేరి నాలుగు సంవత్సరాల ప్రొహిబిషన్ పీరియడ్ పూర్తి చేసుకున్నాం. రెగ్యులర్ చేయాలని విన్నవిస్తున్నాం. 16 రోజుల పాటు నిరసన దీక్షలు చేసినం. మంత్రి దయాకర్‌రావు, ప్రభుత్వం హామీతో దీక్షలు విరమించి, తిరిగి విధుల్లో చేరుతున్నం. న్యాయం జరుగుతుందని ఖచ్చితంగా నమ్ముతున్నం.

- అమరేందర్, జేపీఎస్, దేవరుప్పుల

176 మంది విధుల్లో చేరారు

జిల్లాలో ఉన్న 176 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరారు. అర్ధరాత్రి వరకు వారి నుంచి లిఖిత పూర్వకంగా లెటర్లు తీసుకున్నాం. ఆదివారం నుంచే విధుల్లో చేరినట్టుగా గుర్తిస్తున్నాం. సమ్మె కాలంలో జీపీల పరిధిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం.

- రంగాచారి, డీపీఓ

కేయూ బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీటెక్ నాలుగో సంవత్సరం(సీబీసీఎస్) రెండో సెమిస్టర్(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. 22, 24, 26, 29 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు ఉంటాయని, వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తరిగొప్పుల: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తరిగొప్పుల: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1973-74, 1974-75 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో విద్యార్థులందరూ కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పరమేశ్వర్, జల్లి సిద్ధయ్య, కొండం మధుసూదన్‌రెడ్డి, మాధవరావు, భిక్షపతి, వెంకట్రాజం పాల్గొన్నారు.

వనపర్తిలో..

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తి ఉన్నత పాఠశాలలో 1997-1998 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ రాజిరెడ్డి పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి రూ.12వేలు ప్రధానోపాధ్యాయుడు నర్సింహులుకు అందజేశారు.



లింగాలఘణపురం: వనపర్తిలో..

క్లుప్తంగా

చోరీ నిందితుడి అరెస్ట్

నల్లబెల్లి: విద్యుత్ మోటారును దొంగిలించి అమ్మేందుకు యత్నించిన సూపర్‌వైజర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై అజ్మీరా సురేశ్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గోవిందాపూర్‌కు చెందిన కొట్టె మహేందర్ విద్యుత్ మోటారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఎస్‌కే మోహినొద్దీన్ విద్యుత్ మోటారు మరమ్మతు చేయమని మహేందర్ ఇంటి ఆవరణలో ఉంచాడు. నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ ప్రస్తుతం కంటి వెలుగు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న బిల్‌నాయక్ తండాకు చెందిన మాలోత్ కిషన్ తన బైక్‌పై ఈ నెల 17న రాత్రి కొట్టె మహేందర్ ఇంటికి వెళ్లాడు. ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్ మోటారును బైక్‌పై పెట్టుకుని పరాయ్యాడు. దొంగిలించిన మోటారును అమ్మేందుకు నల్లబెల్లి వైపు వెళ్లే క్రమంలో శనిగరం శివారు జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులకు చిక్కాడు. కిషన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

ఫొటో ఒక చోట.. ఫైన్ మరో చోట!



కొత్తగూడ: కొత్తగూడలో ఉన్న ఓ వ్యక్తికి హెల్మెట్ లేనందున ఫైన్ వేసినట్లుగా మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లో గంగారం మండల కేంద్రంలో బైక్ నడిపినట్లుగా ఉంది. ఆ వాహనదారుడు మాత్రం గంగారం వెళ్లకుండా.. అక్కడ ఎలా ఫైన్ పడిందని ఆందోళన చెందుతున్నాడు. కాగా.. గంగారం పోలీస్‌స్టేషన్ కొత్తగూడలో ఉంది. కొత్తగూడ పోలీసులు, గంగారం పోలీసులు ఇద్దరూ ఫైన్లు వేస్తున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఏ మండల పరిధి పోలీసులు ఆ మండలంలోనే ఫైన్‌లు వేయాలని వాహనదారులు కోరుతున్నారు. ఇదిలాగే కొనసాగితే కోర్టును ఆశ్రయిస్తామని కొందరు చెబుతున్నారు.

కారు పల్టీ.. నలుగురికి గాయాలు


వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని కంకలవాగు సమీపంలో ఆదివారం కారు పల్టీ కొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం కోమటిపల్లి తండాకు చెందిన ఎనిమిది మంది హనుమాన్ మాలధారులు భద్రాచలానికి శనివారం కారులో వెళ్లారు. ఆదివారం ఉదయం భద్రాచలంలో మొక్కులు చెల్లించుకుని తిరిగి వస్తుండగా.. కంకల వాగు సమీపంలో మూల మలుపు వద్ద కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న గిరి, రాజు, శ్రీధర్, తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల సాయంతో 108లో క్షతగాత్రులను వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు.

అస్తవ్యస్తంగా మార్కెట్ పాలన

భర్తీ కాని పోస్టులు
- ప్రధాన కార్యాలయంలో పనిచేయని బయోమెట్రిక్
- వెజ్, ఫ్రూట్ మార్కెట్లపై కొరవడిన పర్యవేక్షణ



వ్యవసాయ మార్కెట్ ప్రధాన పరిపాలన భవనం



పని చేయని బయోమెట్రిక్ మిషన్

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పాలన వ్యవహారాలు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన దిడ్డి రాజ్యలక్ష్మికి మార్కెట్ వ్యవహారాలపై పూర్తిగా అవగాహన లేకపోవడంతో అధికారులపై ఆధారపడ్డారు. దీంతో కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందిపై పర్యవేక్షణ లేకుండా పోయిందని ప్రచారం జరుగుతోంది. అధికారులకు పదోన్నతులు లభించడంతో మార్కెట్ నుంచి వెళ్లిపోతుండడం వల్ల ఉద్యోగుల ఖాళీలు పెరుగుతున్నాయి. ఒక్కొక్కరికి రెండు, మూడు బాధ్యతలు అప్పగించడంపై పర్యవేక్షణ కొరవడినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా లక్ష్మీపురంలోని ఫ్రూట్, వెజ్ మార్కెట్లపై పూర్తి స్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడ ఏం జరుగుతుందో అక్కడ ఉన్నతాధికారులకు తెలియకుండా పోతోంది. మార్కెట్‌లోని ఇద్దరు గ్రేడ్‌-2లకు పండ్ల మార్కెట్ ఒకరికి, వెజ్ మార్కెట్‌ను ఒకరికి అప్పగించారు. వీరు ఎప్పుడూ క్రమంగా మార్కెట్లపై దృష్టి సారించిన దాఖలాలు లేవు.

ఇష్టారాజ్యంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు..

మార్కెట్ కమిటీ పరిధిలో 17 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు(డీఈఓ), 48 మంది సెక్యూరిటీ గార్డులు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. కొంత మంది విధులు సక్రమంగా నిర్వహిస్తుండగా ఇద్దరు, ముగ్గురు ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిసింది. బయోమెట్రిక్ ఉంటే ప్రతి అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సైతం హాజరు నమోదు చేయాల్సిందే. ఈ పరికరం పక్కన పడేయడంతో ఏ ఉద్యోగి ఎప్పుడు వస్తున్నాడు. ఎప్పుడు పోతున్నాడు అన్న సమాచారం లేకుండా పోతునట్లుగా తెలిసింది. విధులకు సక్రమంగా రాక పోవడంపై మార్కెట్ అధికారులు గైర్హాజరు వేయడం అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ సదరు ఉద్యోగులకు వేతనాలు పెండింగ్‌లో పెడుతున్నట్లుగా తెలిసింది. ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించేందుకు బయోమెట్రిక్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. కొంతమంది అవుట్ సోర్సింగ్‌లోని డీఈఓలకు వేతనాలు ఇచ్చేందుకు సంబంధిత విభాగం సూపర్‌వైజర్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాట్సాప్‌లో వైరల్ అయిన విషయంపై మార్కెట్ ఎస్‌జీఎస్ రాహుల్‌ను వివరణ కోరగా.. పనిచేయని రోజులకు మాత్రమే వేతనాల్లో కోత పెడతారని, వేతనాలను నిలిపివేయలేదని సమాధానం ఇచ్చారు. మార్కెట్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు సంవత్సరాల తరపడి ఒకే విభాగంలో పనిచేస్తున్నారు. ఈ కారణంతో సెక్షన్ అధికారులకు వారి మధ్య సంబంధాలు ఎక్కువ కావడంతో వారి మధ్య అంతర్గతంగా ఆధిపత్య పోరు మొదలైంది. ఈక్రమంలో ఒకరిపై ఒకరు బహిరంగంగా ఆరోపణలు చేస్తుండడంతో మార్కెట్ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా.. మార్కెట్ పాలకవర్గం ప్రేక్షక పాత్ర పోషించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సమయపాలన పాటించని ఉద్యోగులు

మార్కెట్ ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్నారు. మార్కెట్ ప్రధాన కార్యాలయ భవనంలో 2010లో బయోమెట్రిక్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఉద్యోగుల ఐడీకార్డులతో హాజరు నమోదయ్యేది. ఉద్యోగులు విధులకు రాకున్నా.. తమ ఐడీ కార్డులను ఇతరులకు ఇచ్చి హాజరు నమోదు చేస్తున్నట్లు గుర్తించారు. ఇది గుర్తించిన అధికారులు ఫేస్ రికగ్నిజేషన్‌తో బయోమెట్రిక్‌ను ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల పాటు నూతన బయోమెట్రిక్ మిషన్‌ను వినియోగించినందున ఉద్యోగుల సమయపాలన కచ్చితంగా నమోదయ్యేది. దీంతో సమయపాలన పాటించాల్సి రావడం ఉద్యోగులు, సిబ్బందికి ఇబ్బందిగా మారింది. బయోమెట్రిక్‌లో నమోదు చేయడం ఇబ్బందిగా ఉందన్న సాకుతో మిషన్‌లో నమోదు ప్రక్రియను పక్కన పడేసినట్లుగా తెలిసింది.

బుర్రా రాములు ఆశయాలను కొనసాగిద్దాం

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య



రాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఖిలా వరంగల్: మానవ హక్కుల ఉద్యమ నేత బుర్రా రాములు ఆశయ స్ఫూర్తిని కొనసాగిద్దామని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్ తిరుపతయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, న్యూడెమొక్రసీ నేత బాలరాజు, స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్ అన్నారు. ఆదివారం ఖిలా వరంగల్ పడమర కోట అమరవీరుల స్తూపం వద్ద మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ ప్రతినిధి బండి కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బుర్ర రాములు యాది సభ జరిగింది. ముఖ్య అతిథులుగా వారు హాజరై బండి కోటేశ్వర్‌రావు, కుటుంబ సభ్యులతో కలిసి రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ ఆర్ఎఫ్‌రాష్ట్ర ఉపాధ్యక్షులు బాదావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి టి.హరికృష్ణ, అద్దునూరి యాదగిరి, పానసాకల దిలీప్, శ్రీనివాస్, వెంకటనారాయణ, సత్యనారాయణ, న్యాయవాది తీగల జీవన్‌గౌడ్, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక హక్కుల గొంతుక

కేయూ క్యాంపస్: ప్రజాస్వామిక హక్కుల గొంతుక ప్రొఫెసర్ బుర్రరాములు అని భోపాల్ ఎన్‌సీఈఆర్టీ ప్రొఫెసర్ బుర్ర రమేశ్ అన్నారు. ఆదివారం కేయూలోని ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ బుర్రరాములు వర్ధంతి యాది సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమేశ్ మాట్లాడుతూ.. 80వ దశకంలోనే విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా ప్రగతిశీల ఆలోచనలకు కేయూను వేదికగా నిలపడంలో ఆయన పాత్ర కీలకమైందన్నారు. పీడీఎస్‌యూ కేయూ కార్యదర్శి కామగోని శ్రవణ్ అధ్యక్షతన నిర్వహించిన యాది సభలో.. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య, జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.విజయ్‌కన్నా, ఎకనామిక్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాధు రాజేశ్ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, ప్రొఫెసర్ బుర్రరాములు కుమార్తె బుర్ర సృజన, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

దంపతులమధ్య గొడవ.. మనస్తాపంతో ఆత్మహత్య



సాయితేజ(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన మొలుగూరి సాయి తేజ(24) మనస్తాపంతో శనివారం విషగుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించగా వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇప్పగూడెం గ్రామానికి చెందిన సాయితేజకు చిల్పూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన అక్షితతో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల వీరి మధ్య మనస్పర్ధలతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం ఎప్పటిలాగే గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన సాయితేజ గ్రామ శివారుకు వెళ్లి తాను చనిపోతున్నానని స్నేహితులకు ఫోన్ చేసి చెప్పి విషగుళికలు మింగాడు. వెంటనే అతడి స్నేహితులు కుటుంబీకులకు సమాచారం అందించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న అతడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అతడు మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

బతుకుదెరువుకు వచ్చి రోడ్డు ప్రమాదానికి బలి



బాలిశెట్టి (ఫైల్)

జనగామ రూరల్: తాటి ముంజలు అమ్ముకునేందుకు వచ్చి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ఆదివారం భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఏదుల గూడెం గ్రామానికి చెందిన గునిగంటి బాలిశెట్టి(53) మృతి చెందాడు. బాలిశెట్టి తాటి ముంజలు అమ్మకుని జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే జనగామ జిల్లా రైల్వే బ్రిడ్జి వద్ద ముంజలు అమ్మి, అదే మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తాటి ముంజలు అమ్ముకునే మరో మహిళను తీసుకుని బాలిశెట్టి ఆటోలో ఇంటికి బయల్దేరాడు. ఈక్రమంలో వరంగల్ నుంచి ఉప్పల్‌కు వెళ్తున్న కారు డ్రైవర్ ఎస్.ప్రవీణ్ జనగామ నుంచి వెళ్తుండగా.. పెంబర్తి వద్ద హైవేపై కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆటో పల్టీ కొట్టింది. డ్రైవింగ్ చేస్తున్న బాలిశెట్టి ఆటోలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. అందులో ప్రయాణిస్తున్న పద్మ చెయ్యి విరిగింది. ఆమెను కారు డ్రైవర్ హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. ఎస్ఐ సృజన్ కేసు నమోదు చేసుకున్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని అబ్బాయిగూడెంలో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అబ్బాయిగూడెం గ్రామానికి చెందిన రమేశ్ ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని గోదావరి నదిలో వలతో చేపల వేటకు వెళ్లాడు. రమేశ్ గోదావరిలో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు లోతులోకి వెళ్లి మునిగిపోయాడు. రమేశ్ మునిగి పోవడాన్ని గమనించిన జాలర్లు గ్రామస్తులకు సమాచారం అందించారు. గల్లంతైన రమేశ్ కోసం గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు.

మొరం టిప్పర్ ఢీకొట్టడంతో గుమస్తా..



అశోక్ (ఫైల్)

సంగెం: అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్ ఢీకొని నెక్కొండ మండల కేంద్రానికి చెందిన కొడారి అశోక్‌యాదవ్(42) మృతి చెందాడు. అశోక్ నెక్కొండలోని ఓ కిరాణాషాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. ఆదివారం వరంగల్‌లో పని చూసుకుని నెక్కొండ వైపునకు బైక్‌పై వెళ్తున్నాడు. తీగరాజుపల్లి ఎన్టీఆర్ జంక్షన్ వద్దకు రాగానే.. సంగెం నుంచి వస్తున్న టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో అశోక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన 108లో ఎంజీఎంకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో అశోక్ మృతి చెందాడు. ఆయన మృతితో కుటుంబం రోడ్డున పడింది. అక్రమ మొరం దందాను, టిప్పర్ల అతి వేగాన్ని కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కారు అదుపు తప్పి ఒకరు..

మహాముత్తారం: మండలంలోని సింగారం అటవీ ప్రాంతంలోని ప్రధాన రహదారిలో వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొని టేకుమట్ల మండలం వెల్లంపల్లికి చెందిన మిట్టపల్లి సారయ్య(60) మృతి చెందాడు. కొత్తగూడెం నుంచి మంచిర్యాలకు పెళ్లి కొడుకును తీసుకు వెళ్తున్న కారు సింగారం అటవీ ప్రాంతానికి రాగానే.. డ్రైవర్ అతివేగంగా నడపడం వల్ల రోడ్డు కిందకు దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న సారయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో అతడు మృతి చెందాడు. మృతుడి కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు డ్రైవర్ వేదవ్యాస్‌పై కేసు నమోదు చేసినట్లు మహాముత్తారం ఎస్సై సుధాకర్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..

ములుగు రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌కు చెందిన కేశవత్ రాజాలు(55) ఆదివారం మృతి చెందాడు. తన పని నిమిత్తం బైక్‌పై మల్లంపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా ఆర్టీసీ బస్సు, లారీ రావడంతో బైక్ అదుపు తప్పి గుంతలో పడింది. దీంతో రాజాలు తలకు బలమైన గాయమవ్వడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు 108కు సమాచారం అందించారు. తొలుత అతడిని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతున్న రాజాలు పరిస్థితి విషమించడంతో అతడు మృతి చెందాడు. మృతుడి కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

విద్యకు పెద్ద పీట

- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్
- విహాన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభం



విహాన్ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి శివారు లో ఏర్పాటు చేసిన విహాన్ పబ్లిక్ స్కూల్‌ను 'కుడా' చైర్మన్ సుందర్‌రాజు, ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డితో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం విహాన్ పబ్లిక్‌స్కూల్ చైర్మన్ డాక్టర్ కె.రామమూర్తి మాట్లాడుతూ.. ఆర్.డి విద్యాసంస్థల 24 ఏళ్ల అనుభవంతో కేజీ టు పీజీ వరకు నాణ్యమైన, గుణాత్మక విద్య అందించడమే లక్ష్యంగా విహాన్ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆరోతరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు పోటీ పరీక్షలు, తొమ్మిదో తరగతిలో మెడికల్, ఐఐటీతోపాటు ఆయా విభాగాల్లో విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా శిక్షణ ఇస్తామన్నారు. విహాన్ పబ్లిక్ స్కూల్ కార్యదర్శి బండి మల్లేశం మాట్లాడుతూ.. విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్ మేకర్స్‌గా తయారు చేయడమే ధ్యేయంగా అధునాతన హంగులతో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి, శివానీ విద్యాసంస్థల చైర్మన్ తాళ్లపల్లిస్వామి, ఎస్ఎస్ఆర్ పాఠశాల కరస్పాండెంట్ సంపత్‌రావు, మోషన్ విద్యాసంస్థల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్, ఐఓఎస్ విద్యాసంస్థల డైరెక్టర్ భరత్, సుజాత విద్యానికేతన్ పాఠశాల కస్పాండెంట్ ఆకుతోట రాంబాబు, నేతాజీ పాఠశాల కరస్పాండెంట్ జ్ఞానేశ్వర్, కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, సిరంగి సునీల్‌కుమార్, పెంబర్తి సర్పంచ్ పూల, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, యూత్ అధ్యక్షుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

'వోపాస్' ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక



వోపాస్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న సత్యనారాయణ

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం(వోపాస్) ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని హనుమకొండలోని ఆదర్శ లా కళాశాలలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపకుడు కట్టా సత్యనారాయణచారి తెలిపారు. అధ్యక్షుడిగా సిద్దోజు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా తొగటి గురుబ్రహ్మం, కోశాధికారిగా వలబోజు కేశవాచారి, సలహాదారుగా డాక్టర్ అనసూరి చంద్రమౌళి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వేల్పుల దేవాచారి, ఉపాధ్యక్షులుగా మారోజు స్వర్ణలత, ఆకారపు ఉపేందర్, డాక్టర్ అడ్లూరి రమేశ్‌బాబు, డాక్టర్ ప్రభాకరాచారి, సదానందచారి, నర్సింహాచారి, సహాయ కార్యదర్శులుగా శ్రీపార సుధాకర్‌రావు, రాజ్‌కుమార్, వెంకటగిరి, అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పూర్ణచందర్, రవి, దేవిప్రసాద్, శంకరయ్య, కార్యవర్గ సభ్యులుగా దేవేంద్రచారి, సురేందర్, కిషన్, శ్రీధర్ కాగితపు సరోజన, సిద్దోజు సూర్యప్రకాష్, విద్యాసాగర్, మరో 10 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- రూపుమారుతున్న చెరువులు, కుంటలు
- పొలాల కోసమని ఇటుక బట్టీలకు సరఫరా
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



ఇటుక బట్టీలకు తరలుతున్న రేగడి మట్టి



నక్కలపెల్లి శివారులో పోస్తున్న రేగడి మట్టి

ఖిలా వరంగల్: మండలంలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారులు ముడుపులు తీసుకుని నచ్చిన చోట తోచినంత తరలించుకునే అవకాశం కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటుకబట్టీల నిర్వాహకులు గత రెండు నెలలుగా డబ్బులు చేత పట్టుకుని సారవంతమైన రేగడి మట్టి కోసం అన్వేషిస్తున్నారు. చెరువుల్లోని నీరు తగ్గగానే రేగడి మట్టి వేట మొదలైంది. ఈ దందా ఎక్కువగా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో జోరుగా సాగుతుంది. దీనిద్వారా ప్రభుత్వానికి ఒక్క రూపాయి ఆదాయం రాదు.. అలాగని ఉచితంగా ఇచ్చేది కాదు. బట్టీల నిర్వాహకులు మాత్రం ఇష్టారాజ్యంగా చెరువులు, కుంటల్లోని మట్టిని తవ్వి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రకృతి సంపద హరించుకుపోతోంది.

మండల కేంద్రంగా ఇటుక బట్టీలు

ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధి నక్కలపెల్లి, గుంటూరుపెల్లి, గాడిపెల్లి, దూపకుంట, బొల్లికుంట, మామునూరు పరిసరాల్లో ఎక్కువగా ఇటుకబట్టీ తయారీ సంస్థలున్నాయి. ధనార్జనే లక్ష్యంగా.. మట్టి తవ్వకాలతో చెరువులు, కుంటల రూపురేఖలు మారుతున్నాయి. ఈబట్టీలకు ఎక్కువగా ఆత్మకూరు, గీసుకొండ, సంగెం, ఐనవోలు మండలాల పరిధి గ్రామ చెరువుల్లోని రేగడి మట్టిని తరలించి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. అదే పంట పొలాల్లోకి సారవంతమైన రేగడి తరలిస్తామంటే మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు లేనిపోని నిబంధనల పేరుతో ప్రజలను భయపెడతారు. వ్యాపారులు దొంగ చాటున తరలించేందుకు ఎలాంటి నిబంధనలు అడ్డు రావడం లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా పగలు, రాత్రి జేసీబీలతో మట్టిని తవ్వి టిప్పర్లలో అక్రమంగా మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధి ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నెల రోజులుగా చెరువులు, కుంటల్లో నుంచి రేగడి మట్టిని అక్రమంగా తరలిస్తున్నా.. రెవెన్యూ, మైనింగ్ శాఖలు, పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రహదారులపై వేగంగా..

వరంగల్-ఖమ్మం రహదారిపై అతివేగంగా రేగడి మట్టి టిప్పర్లు ప్రయాణిస్తున్నాయి. పోలీసుల కంట పడకుండా ఎక్కువ ట్రిప్పులు చేయాలని ఓవర్ లోడ్‌తో డ్రైవర్లు వాహనాల్ని పరుగులు పెట్టిస్తున్నారు. అతివేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి అక్రమంగా అనుమతి లేని రేగడి మట్టిని తరలించే లారీలు, టిప్పర్లపై ఆర్టీఏ, పోలీసు అధికారులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతి లేకుండా తవ్వకాలు..

గ్రామీణ ప్రాంత చెరువుల్లో మట్టిని తవ్వకోవాలంటే మైనింగ్‌శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. మైనింగ్ శాఖ అనుమతి ఇచ్చే ముందు రెవెన్యూ శాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో విచారించి అనుమతులివ్వాలి. క్యూబిక్ మీటర్‌కు నిర్దేశించిన ధర చెల్లించి మైనింగ్ శాఖ అనుమతి పొందాలి. అయితే కొంత మంది పేరు మోసిన ముఠా వ్యాపారులు ఎలాంటి అనుమతుల్లేకుండానే తవ్వకాలు చేపడుతున్నారనే విమర్శలున్నాయి. రెవెన్యూ అధికారులు సైతం చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అనుమతులు ఇవ్వలేదు..

మండల పరిధి చెరువుల్లో తవ్వకాల విషయం నాదృష్టికి రాలేదు. ఇతర మండలాల నుంచి ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తున్నట్లు తెలిసింది. చెరువులు, కుంటల్లో మట్టి తరలింపు జల వనరుల శాఖ పరిధిలో ఉంటుంది. మండల పరిధిలో ఏ ఒక్కరికీ అనుమతివ్వలేదు. - ఫణికుమార్, తహసీల్దార్

50 ఎకరాల మొక్కజొన్న బూడిద

సంగెం: మండలంలోని మొండ్రాయిలో మొక్కజొన్న చొప్ప అంటబెడితే గాలివాటానికి 50 ఎకరాల్లో మొక్కజొన్న చేన్లు దగ్ధమయ్యాయి. ఆదివారం పడమటి రేగడిలో అనుముల మోహన్ రెడ్డి తన వ్యవసాయ క్షేత్రం వద్ద మొక్కజొన్న చొప్పను కాల్చడానికి అంటుబెట్టాడు. గాలివాటానికి పక్కనున్న చేలన్నీ అంటుకుని మంటలు చేలరేగాయి. ఈ మంటలకు రైతు పొన్నాల బుచ్చయ్య ఎడ్లబండి, పెండ్లి ప్రతాప్, రమేశ్, అనుముల పెద్ద మోహన్, కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజుల డ్రిప్ పైపులు, విద్యుత్ సర్వీస్ వైర్లు, కంకులు, జొన్నలు తదితరాలు కాలిబూడిదయ్యాయి. సుమారు 30 ఎకరాల్లో చొప్ప కాలిపోగా.. 20 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. స్థానికులు, ఫైరింజన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. మోహన్‌రెడ్డికి మంటల వల్ల తీవ్ర గాయాలవ్వగా ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు.

11 ఎకరాల్లో మొక్కజొన్న దగ్ధం



నెక్కొండ: కాలిన కంకులను పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

నెక్కొండ: మండలంలోని గొల్లపల్లిలో ఆదివారం 11 ఎకరాల మొక్కజొన్న చేను అగ్నికి ఆహుతైంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దునికి కుమారస్వామి నాలుగెకరాలు, మైల బుచ్చయ్య (చిన్న) మూడు ఎకరాలు, బైకని రమేశ్, బైకని శంకర్‌లు రెండేసి ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రమాదవశాత్తు చేను అగ్నికి అంటుకొని మంటలు వ్యాపించాయి. దీంతో రైతులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వర్ధన్నపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా.. గుర్తు తెలియని వ్యక్తి ఎవరో సిగరెట్, బీడీ తాగి పడేశాడేమోనని, ఆకారణంతో పంట అగ్నికి ఆహుతైందని రైతులు వాపోతున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పశుగ్రాసం దగ్ధం

కాటారం: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తాకడంతో ఆదివారం ట్రాక్టర్‌లో తరలిస్తున్న పశుగ్రాసం, ట్రాక్టర్‌ట్రాలీ దగ్ధమైంది. కాటారం మండలం దామెరకుంట గ్రామానికి చెందిన రైతు తోట బాపు తన పొలంలోని పశుగ్రాసాన్ని ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకొస్తున్నాడు. మార్గమధ్యలో విద్యుత్ తీగ పశుగ్రాసానికి తాకడంతో మంటలు అంటుకున్నాయి. స్థానికుల సహాయంతో మంటలు ఆర్పడానికి ప్రయత్నించగా.. అప్పటికే పశుగ్రాసం, ట్రాలీ దగ్ధమైంది. సుమారు రూ.40 వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.